నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 30 నవంబర్ 2024 | SURYAPET



సూర్యాపేట దీక్షా దివస్‌లో తెలంగాణ తల్లి, అమరవీరుల స్తూపం ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్, మల్లయ్యయాదవ్, నాయకులు బండ నరేందర్‌రెడ్డి, దీపికా యుగంధర్‌రావు, ఒంటెద్దు నర్సింహారెడ్డి

దీక్షా దివస్ గ్రాండ్ సక్సెస్

కదం తొక్కిన బీఆర్ఎస్ సైన్యం

నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన శ్రేణులు

గులాబీ మయంగా జిల్లా కేంద్రాలు

దీక్షా దివస్‌లో యువత సందడి

ధూంధాంగా కళాకారుల ఆటపాటలు

మదిలో మెదిలిన ఉద్యమకాలం నాటి రోజులు

భావోద్వేగానికి లోనైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉద్యమకారులు

ఇదే స్ఫూర్తితో ప్రభుత్వాలపై పోరాటానికి సై..

నల్లగొండ ప్రతినిధి, నవంబర్29(నమస్తే తెలంగాణ) : అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ త్యాగాలను, పోరాట వ్యూహాలను, నాయకత్వ పటిమను చరిత్రలో చిరస్థాయిగా నిలుపడమే లక్ష్యంగా శుక్రవారం జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమ రోజులని తలపించేలా దీక్షా దివస్‌లు కొనసాగడం విశేషం. ఆయా జిల్లాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో గులాబీ సైన్యం, ఉద్యమకారులు, అభిమానులు ఉదయం నుంచే నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కేంద్రాల్లో కదం తొక్కారు. దాదాపు ప్రతి గ్రామం నుంచి దీక్షా దివస్‌లో పాల్గొనేందుకు తరలిరావడం కనిపించింది. ఉద్యమ కాలంలో ఉద్యమ నేత కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా ఊర్లకు ఊర్లకే కదలిన మాదిరిగా నేటి దీక్షా దివస్‌లోనూ ప్రతి ఊరూ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు కదలివచ్చారు. పెద్ద సంఖ్యలో యువతను భాగస్వామ్యం చేయాలన్న లక్ష్యంగా కూడా నెరవేరినట్లైంది. దీక్షా దివస్ ప్రాంగణాల్లోనూ యువత భారీగా సందడి చేసింది. మరోవైపు కళాకారుల ఆటపాటలు సైతం అలనాటి ధూంధాంలను తలపిస్తూ ఆ ప్రాంతాన్ని దద్దరిల్లేలా చేశారు. ఆనాటి ఉద్యమకారులు నేతల ప్రసంగాల్లో పలుమార్లు భావోద్వేగాలకు గురవుతూ కనిపించారు. కేసీఆర్ ప్రాణ త్యాగానికి సిద్ధపడతూ ఆమరణ దీక్షకు పూనుకోవడం... కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం, కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తున్న సందర్భం.. ఇలా ఒక్కో ఘట్టాన్ని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వివరిస్తుంటే ఆ నాటి ఉద్విగ్నభరిత పరిస్థితులను తలచుకుంటూ భావోద్వేగాలతో పలువురు కంటతడి పెట్టడం అందరినీ కదిలించింది. జగదీశ్‌రెడ్డి కూడా ఒక దశలో తీవ్ర భావోద్వేగానికి గురవుతుండగా మాటలు పెకలలేదు. ఆనాటి ఉద్యమ పరిస్థితులను తలుచుకుంటూ కేసీఆర్ అకుంఠిత దీక్షను చాటిచెప్తూ భవిష్యత్తు తరాలకు రాష్ట్ర సాధన విశేషాలను, ఆనాటి పోరాట స్ఫూర్తిని రగిలించేలా దీక్షా దివస్ కొనసాగింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మార్గదర్శనంలో దివస్ జిల్లా ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ దీక్షా దివస్ ప్రాంగణాలన్నీ ప్రారంభం నుంచి ముగింపు వరకు పార్టీ శ్రేణులు, అభిమానులు, ఉద్యమకారులతో సందడిగా మారాయి.

సూర్యాపేట దీక్షా దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కార్యక్రమ ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి

నల్లగొండ దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, వేదికపై మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, నోముల భగత్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

నల్లగొండ : నాటి ఉద్యమంలో కేసీఆర్ మాట్లాడుతున్న ఫొటోను దీక్షా దివస్‌లో ప్రదర్శిస్తున్న ఉద్యమకారుడు

బీఆర్ఎస్ పేదలు, రైతుల పక్షం

కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో.. నినాదంతో ఢిల్లీ పీఠాన్ని కదిలించింది దీక్షా దివస్. అలాంటి రోజును భావి తరాలకు తెలుపాల్సిన అవసరం మనందరిపై ఉంది. నాడు కరీంనగర్ నుంచి మొదలైన దీక్ష ఉద్యమం సిద్దిపేటలో కేసీఆర్‌ను అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించగా కేసీఆర్ దీక్ష విరమించాడని తప్పుడు ప్రచారం చేశారు. నాదీక్ష విరమించడం లేదని, నా దీక్ష కొనసాగుతుందని కేసీఆర్ చెప్పి ఉద్యమాన్ని ఉధృతం చేసి తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. కేసీఆర్ తెలంగాణను తెస్తే ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి మాయ మాటలు చెబుతూ పాలన గాలికి వదిలేశారు. కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదు. కేసీఆర్ లేకుండా తెలంగాణ లేదు. వేల కోట్లతో సంక్షేమ పథకాలు ఉండేవి కావు. బీఆర్ఎస్‌ను మొలవకుండా చేస్తా, కేసీఆర్ నీ పేరు చెరిపేస్తా అంటున్న మూర్ఖుడు రేవంత్‌రెడ్డి. బీఆర్ఎస్ పేదల పక్షం, రైతులపక్షం.. ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్న ప్రజా సమస్యలే ఎజెండాగా ప్రజల మధ్య ఉండి పని చేస్తాం.

– బడుగుల లింగయ్యయాదవ్,
బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ

తెలంగాణ ఉద్యమానికి ఒక జ్వాల దీక్షా దివస్

తెలంగాణ ఉద్యమం అనేది ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది. మాలాంటి యువకులను కేసీఆర్ ప్రోత్సహించడంతోనే వేలాదిగా, లక్షలాదిగా యువతరం ఉద్యమంలోకి వచ్చారు. ఆయన చేసిన దిశానిర్దేశంతో ఉడుకు రక్తమైనా శాంతియుతంగా ఉద్యమాలు చేశాం. కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ శవయాత్రనో తెలంగాణ జైత్రయాత్రనో అంటూ తన ప్రాణాన్ని పణంగా పెట్టడంతో తెలంగాణ మొత్తం ఏకమైంది. కేసీఆర్ కోసం రాష్ట్రపతిగా పని చేసి రిటైర్ అయిన ప్రణబ్ ముఖర్జీ తన పుస్తకంలో కేసీఆర్‌కు ఒక పేజీని కేటాయించారు. ఒక ఉద్యమాన్ని ప్రారంభించి ఆ ఉద్యమాన్ని ముద్దాడే వరకు చివరి వరకు పోరాడిన తీరు.. తానే పాలించిన సందర్భం ఒక్క కేసీఆర్‌కు తప్ప మరెవరికీ లేదని చెప్పిండు. కేసీఆర్‌ను దీక్ష చేయొద్దని చెప్పినా వినకుండా ఏదో ఒకటి తేల్చుకుంటానని కేసీఆర్ ముందుకు పోతే అన్ని వర్గాలు వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమానికి నాంది పలికారు. శ్రీకాంతాచారి, వేణుగోపాల్ లాంటి వారు బలిదానం కూడా చేశారు. ఎవరైతే తెలంగాణ గురించి ఒక్కనాడు కూడా మాట్లాడనోడు వచ్చి తెలంగాణ ఏలుతున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదు. తెలంగాణ ప్రజలపై ఆయన ఎలాంటి ప్రేమ లేదు. డబ్బుల కోసం దీక్షలు చేసిన నల్లగొండకు చెందిన పలువురు మేం ఉద్యమం చేశామని మాట్లాడడం సిగ్గు చేటు. ప్రజాపాలన విజయోత్సవాలు కాకుండా తరేవంత్‌రెడ్డి ఏడాది మాశికం చేయాలని ప్రజలంటున్నారు. ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించి ప్రతిపక్షంగా మన పాత్రను బలంగా పోషిస్తూ ముందుకు సాగాలి.

– డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే

తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది

నల్లగొండ జిల్లాలో మంచినీళ్లు తాగితే ఫ్లోరైడ్‌తో విషంగా మారి కాళ్లు, చేతులు వంకరలు తిరిగిన బాధితులుగా నాడు పట్టించుకున్న నాథుడే లేడు. ఈ జిల్లాను ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మార్చాలనే ఉద్దేశంతో కేసీఆర్ అధికారంలోకి రాగానే మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీళ్లు ఇచ్చారు. ప్రస్తుతం ఒక ఫ్లోరైడ్ కేసు కూడా లేదు. నాడు తినడానికి తిండి లేక ఖర్చుల కోసం భూములు అమ్ముదామంటే కొన్న నాథుడు లేడు. కానీ నేడు కేసీఆర్ చేసిన అభివృద్ధితో అదే భూమి ధరలు పెద్ద ఎత్తున పెరిగాయి. ప్రాణాలను పణంగా పెట్టి తెచ్చుకున్న తెలంగాణ కాంగ్రెస్ పాలనలో ఆగమైతుంటే చూసి తట్టుకోలేకపోతున్నాం. నాడు దీక్ష చేయడం వల్ల జరిగిన ప్రయోజనాన్ని రేపటి తరాలకు వివరించడానికి ఈ దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాం. బీఆర్ఎస్ పార్టీగా రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

–బొల్లం మల్లయ్యయాదవ్, కోదాడ మాజీ ఎమ్మెల్యే

కేసీఆర్ దీక్ష.. పట్టుదలతోనే తెలంగాణ రాష్ట్రం

ప్రత్యేక రాష్ట్రం ఎవరూ ఇవ్వలేదు.. తెగించి కొట్లాడితే వచ్చింది

తెలంగాణ పట్ల వివక్ష వల్లే కేసీఆర్ రాష్ట్ర సాధనకోసం శ్రీకారం

దీక్ష సమయంలో కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉన్నా వెనకాడలే

కేంద్రంలో బీజేపీ-కాంగ్రెస్, రాష్ట్రంలో కాంగ్రెస్-టీడీపీ ఒక్కటైనయ్

కేసీఆర్ పోరాటంతో తప్పలేక ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారు

దీక్షా దివస్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ దీక్షా దివస్‌లో మాట్లాడుతూ కంటతడి పెడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ దీక్షా, పట్టుదల వల్లనే తెలంగాణ రాష్ట్రం నేడు ప్రపంచ పటంలో నిలిచిందని, దీనికి కేసీఆర్ తప్ప ఏ ఒక్కరూ కారణం కాదని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అధ్యక్షతన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి, అమరవీరుల స్థూపానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఏ ఒక్కరూ ఇవ్వలేదని, కేసీఆర్ తెగించి కొట్లాడడం వల్ల గత్యంతరం లేక ఇచ్చినట్లు తెలిపారు. కేసీఆర్ తెలంగాణకు జరుగుతున్న అన్యాయన్ని గుర్తించి నాలుగేండ్లు ఎంతోమందితో చర్చించి రాష్ట్ర సాధన కోసం 2001 ఏప్రిల్ 27న టీఆర్ఎస్ పార్టీని స్థాపించారని చెప్పారు. ఆంధ్రా పాలకులు తెలంగాణకు నిధులు ఇవ్వకపోవడంతోపాటు తెలంగాణలో రైతులకు విద్యుత్ చార్జీలను పెంచడం కూడా టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావానికి ఒక కారణంగా చెప్పుకొచ్చారు. బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు చేపట్టిన చంద్రబాబు పోకడలను నిరసిస్తూ ఆ పార్టీకి రాజీనామా చేసి తర్వాత టీఆర్ఎస్‌ను స్థాపించినట్లు తెలిపారు. ఇరిగేషన్ రంగంలో మైనర్ ఇరిగేషన్ పేరుతో తెలంగాణకు తక్కువ నిధులు, మేజర్ ఇరిగేషన్ పేరుతో ఆంధ్రాకు ఎక్కువ నిధులు ఇస్తూ మోసం చేయడంతోపాటు అక్కడ రైతులకు నీటితీరువాను తీసుకోకుండా తెలంగాణ రైతుల పట్ల కఠినంగా వ్యవహరించడం కారణంగానే మారిన కేసీఆర్‌ను చంద్రబాబు అండ్ కో, ఆయన మీడియా విషపు ప్రచారం చేసినట్లు చెప్పారు. అలాంటి సందర్భంలో నా స్వప్నం... నాధ్యేయం... నా సంకల్పం... నా విజన్ అంతా తెలంగాణ రాష్ట్ర సాధన కోసమేనని, ఈ మధ్యలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా వెనుకడుగు వేసేది లేదని, పార్టీ మారేది లేదని ముందుకు సాగిన మహానేత కేసీఆర్ అంటూ గుర్తుచేశారు. అయితే ఆర్టికల్3 ద్వారా పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేపిస్తే తెలంగాణ వస్తుందనే ఉద్దేశంతో ఎన్నికలను ఆయుధంగా చేసుకుని ముందుకు సాగినట్లు తెలిపారు. కామన్ మినిమన్ ప్రోగ్రాంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అంశాన్ని చేరుస్తామంటే అప్పట్లో పొత్తుపెట్టుకున్నాక.. చంద్రబాబు, వైఎస్ఆర్ ఏకమై కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలంగాణ ఇవ్వకుండా చేయడం వల్లనే కేసీఆర్ దీక్ష వరకు వెళ్లినట్లు చెప్పారు. దీక్ష సమయంలో కాంగ్రెస్ అధిష్టానం ఎన్ని కుట్రలు చేసినా విరమించకపోవడం వల్లనే తెలంగాణ ఇస్తామని నాడు కేంద్రం ప్రకటించినట్లు తెలిపారు. ఆంధ్రాలో అన్ని పార్టీల వారు కుట్రలు పన్ని మరో ప్రకటన వ్యతిరేకంగా చేయించినప్పటికీ కేసీఆర్ పట్టుదల, తెలంగాణ ప్రజల సహకారం వల్ల రాష్ట్రం సిద్ధించినట్లు చెప్పారు. ఈ విషయంలో తెలంగాణలో ఉన్న అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు తెలంగాణ రాష్ట్రానికి సహకరించలేదని, ఒక్క టీఆర్ఎస్ వల్లనే ఈ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. వచ్చిన రాష్ట్రాన్ని పదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటే ఏడాదిలోనే రేవంత్ సర్కార్ సర్వనాశనం చేసినందని విమర్శించారు.

సూర్యాపేట దీక్షా దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కార్యక్రమ ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి

చెప్పడంలో విఫలమయ్యాం..

తెలంగాణ రాష్ట్రం రావడానికి కేసీఆర్ త్యాగమే కీలకమని, గులాబీ జెండానే కారణమని, మోసాలను, కుట్రలను ఛేదిస్తూ కేసీఆర్ అనుసరించిన పోరాట వ్యూహమే సాధనని జగదీశ్‌రెడ్డి తెలిపారు. వీటన్నింటితోనే తెలంగాణ రాష్ట్రం సాకారం అయ్యిందన్న వాస్తవాన్ని మనం భవిష్యత్తు తరాలకు, ముఖ్యంగా నేటి యువతకు చెప్పడంలో బీఆర్ఎస్ పార్టీగా వెనకబడ్డామని చెప్పారు. ఆయన త్యాగమే తెలంగాణ తెచ్చిందని మనం చెప్పుకోవడంలో విఫలమయ్యామని, కేవలం మనం అభివృద్ధి వెంటే పడ్డాం..ఆ ముచ్చటే ప్రజలకు చెప్పామని, కానీ కేసీఆర్ త్యాగాన్ని ఇప్పటి తరంలోకి తీసుకెళ్లడంలో పొరపడ్డామని తెలిపారు. ఇప్పటికైనా మన దూరమైన వర్గాలకు దగ్గరయ్యేలా కార్యాచరణ ఉండాలని, ప్రస్తుత తరానికి వాస్తవాలు చెప్పాలని సూచించారు. తెలంగాణ ఎందుకొచ్చింది? ఎట్లొచ్చింది? కేసీఆర్ త్యాగం ఏంటీ? నాయకత్వ పటిమ ఎట్లుండే? ఇలాంటి విషయాలన్నీ మళ్లీ విస్తృతంగా ప్రజల్లోకి, ముఖ్యంగా యువతలోకి తీసుకెళ్లాలని తెలిపారు. చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉండేలా కేసీఆర్ గురించి నిరంతరం చెప్పుకోవాలని అన్నారు. భారీ సంఖ్యలో తరలిచ్చిన దీక్షా దివస్‌లో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా అభినందనలు తెలిపారు.

భావోద్వేగానికి లోనైన జగదీశ్‌రెడ్డి

కేసీఆర్ దీక్ష విషయాన్ని ప్రస్తావిస్తున్న సందర్భంలో జగదీశ్‌రెడ్డి భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. 2009 డిసెంబర్ 9న కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తుందని, కాసేపట్లో కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబితే.. తామంతా భయపడి కాంగ్రెస్ పార్టీ పట్టించుకునే పరిస్థితిలో లేదు, దీక్ష విరమించమని కేసీఆర్‌ను కోరితే 'తెలంగాణ వస్తేనే కేసీఆర్ దీక్ష నుంచి బయటకు వస్తాడు.. లేదంటే నా శవాన్ని తీసుకెళ్లి ఊరేగించండి' అన్నాడు తప్ప దీక్షను మాత్రం విరమించలేదని చెబుతున్న సందర్భంలో జగదీశ్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. రాజులేని రాజ్యం ఎలా ఉంటుందో, నాయకుడు లేని పార్టీ రాష్ట్ర సాధన కోసం ముందుకు వెళ్తున్న సందర్భంలో విచ్ఛిన్నం అవుతుందేమోనని భయపడినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కేసీఆర్ మొండితనం పట్టుదల వల్లనే కేంద్రం అదే రోజున రాష్ట్ర ఏర్పాటు చేస్తున్నామని ప్రకటన చేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో దీక్షా దివస్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్, నల్లగొండ మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దీపికాయుగంధర్‌రావు, నాటి ఉద్యమ నేత జిల్లా గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, పుట్ట కిశోర్, దావుల వీరప్రసాద్‌యాదవ్, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సింగిల్‌విండో చైర్మన్‌లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భువనగిరిలో దీక్షా దివస్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు కార్యకర్తలు

తెలంగాణకు కాంగ్రెస్ మోసం నెహ్రూతోనే మొదలైంది

తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం ఏ సోనియాగాంధీ నుంచో రాజీవ్‌గాంధీ నుంచో మొదలు కాలేదు, జవహర్‌లాల్ నెహ్రూతోనే మొదలైంది. మా రాష్ట్రం మాకు ఉంచాలని చెప్పిన వినకుండా ఆంధ్రవాళ్లు చెప్పింది విని 1956లో హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపారు. 1953లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడితే కర్నూలును రాజధానిగా చేసుకొని సెక్రటేరియట్ కూడా లేకుండా ఉన్న ఆంధ్ర ప్రదేశ్‌ను హైదరాబాద్‌పై కన్ను పడి నెహ్రూను ఒప్పించి విలీనం చేశారు. మూడు ఉద్యమాలకు సజీవ సాక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ ఉన్నారు. ముల్కి ఉద్యమం, 1969 ఉద్యమం, 2001లో కేసీఆర్ నాయకత్వంలో కూడా జయశంకర్‌సార్ తెలంగాణ ఉద్యమంలో ఉన్నారు. ఒక అహింసాయుతంగా పద్ధతి ప్రకారం ఉద్యమాన్ని నడిపించడం కేసీఆర్‌కు తప్ప మరెవరికీ తెలియదు. 60 సంవత్సరాలు ఒక రాష్ట్ర ప్రజలు మా రాష్ట్రం మాకు కావాలని చేసిన ఉద్యమం ప్రపంచంలో తెలంగాణ ఉద్యమం తప్ప మరొకటి లేదు. స్వార్థం కోసం పదవుల కోసం తెలంగాణను వాడుకున్న వారు ఉన్నారు తప్ప పదవులు త్యజించింది కేసీఆర్ ఒక్కరే. ఎవరినో ముందుకు పంపి తాను వెనుక ఉండకుండా తానే 2009లో ఆమరణ దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించారు. తెలంగాణ సమస్యను జాతీయ సమస్యగా మార్చి 36మంది పార్టీ అధ్యక్షులతో ఏకాభిప్రాయం తీసుకోగా తోటి పార్లమెంట్ సభ్యుడు చనిపోతున్నాడని ప్రశ్నించడంతో తెలంగాణ ఇచ్చారు. కేసీఆర్ ఉద్యమం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తిని పొందాలి.

–ఒంటెద్దు నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి

కేసీఆర్ ఉద్యమం డాక్యుమెంటలీని వీక్షిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు